క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

నవాబుపేట: మండలంలో గురువారం జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పర్యటిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య తెలిపారు. మండల కేంద్రంలో మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమంతో పాటు కారుకొండ, దేపల్లి, వాబుపేట, కేశవరావుపల్లి గ్రామాల్లో బీటీ, సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపనలు గురువారం చేయనున్నారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా చందర్



నవాబుపేట: మండలంలోని కొల్లూర్ పంచాయతీ పరిధిలోని సత్రోని పల్లితండాకు చెందిన చందర్‌నాయక్‌ను ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్ తెలిపారు. ఈసందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రకమిటీని ఆయన ప్రకటించారు. నూతన కమిటీ సభ్యులు రాబోయే రోజుల్లో గిరిజనుల అభ్యున్నతికి కృషిచేయాలని సూచించారు.

ఫర్నిచర్ అందజేత



అడ్డాకుల: మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌కు ప్రగతి స్పిన్నింగ్ మిల్లు నిర్వాహకులు ఫర్నిచర్‌ను బుధవారం అందజేశారు. కంపెనీ ఎండీ ఆళ్ల జితేంద్రప్రసాద్ సూచనతో పాఠశాల విద్యార్థుల కోసం 12 టేబుళ్లు, 20 కుర్చీల కంపెనీ జీఎం గుట్లపల్లి రమేష్‌బాబు టీచర్లకు బహూకరించారు. పాఠశాల అభ్యున్నతికి కృషి చేస్తామని జీఎం తెలిపారు. స్పిన్నింగ్ మిల్లు నిర్వాహకులను ఉపాధ్యాయులు సత్కరించారు. పాఠశాల హెచ్ఎం జ్యోతి, కంపెనీ ఉద్యోగులు శివప్రసాద్, తుమ్మల ప్రవీణ, ఉపాధ్యాయులున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో తిష్టవేసిన సమస్యలు పరిష్కరించాలంటూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం వార్డు అధికారి జగదీశ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆసంఘం జిల్లా అధ్యక్షుడు జగన్ మాట్లాడుతూ మున్సిపాలిటీలోని 5వ వార్డు నాగసాల, నిమ్మబావిగడ్డల్లో రోడ్లు దెబ్బతిన్నాయన్నారు. వీధి లైట్లు వెలగటం లేదని, మురికి కాలువ సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారని అన్నారు. ప్రజాసంఘాల నాయకులు జయరాం, శ్రీశైలం, సంధ్యారాణి, ఇందిరమ్మ, శ్యాంసుందర్, కేశవులు పాల్గొన్నారు.

ఘంటసాలకు ఘన నివాళి



జడ్చర్ల టౌన్: ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతి పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని రిటైర్డ్ ఎంప్లాయీస్ భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఘంటసాల మధురగీతాలను ఆలపించారు. గీతాలను ఆలపించిన వారిని మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, కౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డి సత్కరించారు. ఘంటసాల లలిత కళాతోరణం సభ్యులు రాంకుమార్, దత్తుకుమార్, నాగిరెడ్డి, గోపాలరావు, గోనెల రాధాకృష్ణ పాల్గొన్నారు.

పీఆర్సీని అమలు చేయాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం వెంటనే పీఆర్సీ అమలు చేయాలని తపస్ జిల్లా ఇన్‌చార్జి వరప్రసాద్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తపస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ జిల్లా సమావేశంలో మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. సమస్యల సాధనకు ఈనెల 17న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే నిరసనకు పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సునీల్, బాబునాయుడు, కరుణాగౌడ్, రాజ్‌మోహన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నేడు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

నవాబుపేట: స్థానిక మార్కెట్ కమిటీ గురువారం ప్రమాణ స్వీకారం చేయనుంది. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సమక్షంలో నూతన పాలకవర్గం కొలువుతీరనుంది. మండలంలోని పోమాల్‌కి చెందిన లింగం చైర్మన్‌గా, మాజీ ఎంపీటీసీ తులసీరాంనాయక్ వైస్ చైర్మన్‌గా, వివిధ గ్రామాలకు చెందిన 12మంది డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- కలెక్టర్ విజయేందిర బోయి



బోయిన్‌పల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి ➤

మిడ్జిల్: పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నాణ్యమైనది అందించాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. బుధవారం మండలంలోని బోయిన్‌పల్లి ఉన్నత పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. బియ్యం, ఆహార పదార్థాలను పరిశీలించారు. ఎలాంటి ఫిర్యాదులు రానివ్వద్దని సిబ్బందికి సూచించారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులతో పాఠ్యాంశాలపై మాట్లాడి వారితో చదివించారు. విద్యార్థులు ఇంగ్లీష్ సరిగా చదవకపోవడంతో వారికి అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం పెంచాలన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సమగ్ర సర్వే నమోదును పరిశీలించారు.

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్సెస్సీ స్పెషల్ క్లాస్‌లకు హాజరవుతున్న విద్యార్థులకు మల్టీ గ్రెయిన్ బిస్కెట్లు ఇవ్వాలని తెలంగాణ గజిటెడ్ హెడ్‌మాస్టర్స్ సంఘం నాయకులు కలెక్టర్ విజయేందిర బోయికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈమేరకు సంఘం నాయకులు అనంతప్ప, జగదీష్, అబ్దుల్‌హక్ మాట్లాడారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



లబ్ధిదారులతో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం 100మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం పూర్తయిందన్నారు. ఈ సంవత్సర కాలంలో ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, నాయకులు మహేందర్, ఖాజపాషా, తిరుమల వెంకటేష్, రాషెద్, మోసీన్, నర్సింలు, లతశ్రీ లక్ష్మణ్‌నాయక్, మునీర్, టంకర కృష్ణయ్య, సుధాకర్‌రెడ్డి, నవనీత, వెంకటయ్య పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: ఆరెకటికల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం ఆరెకటిక అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్ సూచన మేరకు ఆరెకటికలు ఎమ్మెల్యేను క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. మాంసం విక్రయ వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు విజయబాబు, ప్రధాన కార్యదర్శి రవీందర్, కార్యవర్గ సభ్యులు లక్ష్మీనారాయణ, ఉదయ్‌కిరణ్, జహంగీర్, బాలాజీ, కిషన్‌జీ పాల్గొన్నారు.

స్టేషన్ మహబూబ్‌నగర్: హజ్రత్ సయ్యద్‌షా జమాల్ హుస్సేనీ చిస్తీ, సయ్యద్ కమాల్ హుస్సేనీ చిస్తీ రహెమతుల్లా అలై దర్గా 649వ ఉర్సు వేడుకలు ఈనెల 7నుంచి 9వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు దర్గా ముతవల్లీ షా మహ్మద్ ఫజల్‌ఖాన్ తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని కలిసి ఆహ్వానపత్రిక అందించి శాలువా, పూలమాలతో సత్కరించారు. దర్గా ఉర్సులో పాల్గొనాలని కోరారు. జిల్లా మైనార్టీ కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ ఫయాజ్, నాయకులు ఫక్రుద్దీన్, మొయిజ్, రహమత్, యాసిన్ అలీ, వెంకటేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన



మిడ్జిల్: మండలంలోని వస్పుల ఉన్నత పాఠశాలలో బుధవారం సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు ఓటీపీ అడిగితే ఎవరూ కూడా చెప్పవద్దని సూచించారు. గ్రామాల్లో ఎవరైన గుర్తు తెలియని వ్యక్తులు కనబడితే పోలీసులకు సమాచారమివ్వాలని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య, పర్వతాచారి తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర: విద్యార్థులు గుర్తు తెలియని వాట్సాప్ కొత్త గ్రూపుల్లో చేరవద్దని ఎస్ఐ నాగన్న సూచించారు. బుధవారం దేవరకద్ర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు వివిధ రకాలుగా మోసాలకు పాల్పడుతున్నారని అన్నారు. వాట్సాప్ గ్రూపుల్లో ప్రవేశించి మాయమాటలతో మెసేజ్‌లు చేసి ఉద్యోగాలు ఇప్పిస్తామని, ఇంటి వద్ద ఉండి సంపాదించుకోవచ్చని రకరకాలుగా ట్రాప్ చేసే అవకాశం ఉందన్నారు. యువత అప్రమత్తంగా ఉండాలని కోరారు. అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ముడా చైర్మన్



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని ముడా కార్యాలయం ఆవరణలో బుధవారం చైర్మన్ కె.లక్ష్మణ్‌యాదవ్ వివిధ మొక్కలు నాటారు. కార్యక్రమంలో ముడా వైస్ చైర్మన్ డి.మహేశ్వర్ రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఈఈ విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

హామీలను అమలు చేస్తున్నాం



రంగారెడ్డిగూడలో విద్యుత్ సబ్‌స్టేషన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

- ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

రాజాపూర్: ఎన్నికల వేళ ప్రజలకిచ్చిన హామీలను అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. బుధవారం బాలానగర్, రాజాపూర్ మండలాల్లోని నేరళ్లపల్లి, గౌతాపూర్, రంగారెడ్డిగూడ గ్రామాల్లో నూతనంగా ఏర్పాటు చేయనున్న విద్యుత్ సబ్‌స్టేషన్లకు శంకుస్థాపనలు చేశారు. అలాగే గంగధర్‌పల్లి, మల్లేపల్లి, కుచ్చర్‌కల్, ఈద్గాన్‌పల్లి, దోండ్లపల్లి, తిర్మలగిరి, రాజాపూర్, పల్లుగడ్డ గ్రామాల్లో సీసీ రోడ్లు, అండర్ డ్రైయినేజీ, అంగన్‌వాడీ భవనాల ఏర్పాటు వంటి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఇది ప్రచారాల కోసం చేసే ప్రభుత్వం కాదని ప్రజలకోసం పనిచేసే ప్రభుత్వమన్నారు. వ్యవసాయ రంగంతో పాటు విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తుందన్నారు. విద్యుత్‌శాఖ ఎస్ఈ వెంకటరమేష్, డీఈ చంద్రమౌళి, ఏడీ నవీన్‌కుమార్, ఏఈలు సుజాత, చంద్రశేఖర్, నాయకులు రాములుగౌడ్, వెంకట్‌రెడ్డి, నరహరి, రవికుమార్‌గుప్తా, శివకుమార్, దశరథం పాల్గొన్నారు.

నవాబుపేట పీహెచ్‌సీ వైద్యాధికారిగా శ్రావణ్‌కుమార్



నవాబుపేట: స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిగా డాక్టర్ శ్రావణ్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆసుపత్రి వివరాలు తెలుసుకొని వైద్యసిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అందరూ బాధ్యతతో పనిచేస్తూ సమయపాలన పాటించాలని సూచించారు. సిబ్బంది శ్రీనివాస్, శరభలింగం, రాఘవేందర్, శ్రీనివాసులు ఉన్నారు.

దాడులపై ఎందుకు స్పందించరూ?



మాట్లాడుతున్న టి.ఆచారి

జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు టి.ఆచారి

జడ్చర్ల టౌన్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులపై రాహుల్, ప్రియాంక, మల్లికార్జున ఖర్గేతో పాటు జాతీయ పార్టీలైన బీఎస్పీ, ఎన్సీపీ నాయకులు ఎందుకు స్పందించరని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు, బీజేపీ నాయకుడు టి.ఆచారి ప్రశ్నించారు. బుధవారం నియోజకవర్గ కేంద్రంలో జరిగిన బీజేపీ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ నాయకులతో పాటు ఇతర పార్టీల నాయకులు ఎందుకు ఆ అక్రమాలు, దాడులపై మాట్లాడటం లేదన్నారు. అక్కడ జరుగుతున్న దాడులపై స్పందించాలని స్థానిక ముస్లింలకు పిలుపునిచ్చారు. బంగ్లాలో జరుగుతున్న దాడులకు నిరసనగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా పాలమూరు బిడ్డ అయ్యాడన్న సంతోషం జిల్లావాసులకు మిగల్చలేదని రేవంత్‌రెడ్డి పాలనపై ఆచారి విమర్శించారు. బీజేపీ నాయకులు బాలత్రిపురసుందరి, ముచ్చర్ల కృష్ణయ్య, ఎడ్ల బాలవర్ధన్‌గౌడ్, సామల నర్సింహులు, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, తిరుపతి, జనార్దన్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, సాహితిరెడ్డి, కొంగళి శ్రీకాంత్‌లు పాల్గొన్నారు. అంతకుముందు క్రాస్‌రోడ్డు నుంచి బైక్‌ర్యాలీ నిర్వహించారు.

పరిశుభ్రతకు పెద్ద పీట



జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీలోని అన్నివార్డుల్లోనూ పరిశుభ్రతకు పెద్దపీట వేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత తెలిపారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని 25వ వార్డులో ఆమె పర్యటించారు. మురుగు కాలువలు, కంపచెట్లు, ముళ్ల పొదలు మొదలైన వాటిని పరిశీలించారు. వాటిని తక్షణమే తొలగించాలని మున్సిపల్ సిబ్బందికి ఆదేశించారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో సహకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ లత పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

మహమ్మదాబాద్: ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకుంటామని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ముందలితండాకు చెందిన రాగ్యా, గంగాబాయిల కుమారుడు 2022లో ఏకలవ్య మోడల్ పాఠశాలలో 9వ తరగతి చదువుతూ ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందాడు. ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు రూ.5లక్షల ఆర్థిక సాయం మంజూరు చేసింది. బుధవారం ఆచెక్కును ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి బాధిత కుటుంబానికి అందజేశారు. మాజీ ఎంపీపీ శాంతీబాయి, ఆర్ఐ మోహీద్దీన్, శ్రీనివాస్, ముకుందం, భీమయ్య పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ



మహా పడిపూజ చేస్తున్న అయ్యప్ప మాలధారులు

హన్వాడ: మండలంలోని పెద్దర్పల్లిలో బుధవారం అయ్యప్ప మహా పడి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గురుస్వామి రఘుపతిశర్మ ఆధ్వర్యంలో స్థానిక శివస్వామి గృహంలో ఈ కార్యక్రమం చేపట్టారు. వివిధ గ్రామాల నుంచి అయ్యప్ప మాలధారులు తరలివచ్చారు. అయ్యప్ప నామ స్మరణతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. అనంతరం అయ్యప్ప మాలధారులకు, భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకన్న, మాజీ ఉపసర్పంచ్ ప్రవీణ్, ఎఫ్ఏసీఎస్ వైస్‌చైర్మన్ కృష్ణయ్యగౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు అయ్యప్పస్వామి పడి పూజ

దేవరకద్ర: మండల కేంద్రంలోని ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం అయ్యప్పస్వామి పడి పూజ నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప సేవా సమాజం ప్రతినిధులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5గంటలకు అయ్యప్పస్వామి పల్లకీ సేవ, శోభాయాత్ర జరుగుతుందని, 10 గంటలకు దేవాయంలో పడిపూజ నిర్వహిస్తారన్నారు. మధ్యాహ్నం అన్నప్రసాదం పంపిణీ ఉంటుందన్నారు. ఈ పూజలకు అయ్యప్ప మాలధారులతో పాటు భక్తులు హాజరుకావాలని వారు కోరారు.

టీఎస్‌యూటీఎఫ్ కార్యవర్గం ఏర్పాటు



ప్రమాణస్వీకారం చేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ కార్యకర్గం

హన్వాడ: మండల టీఎస్‌యూటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కిష్యానాయక్, ప్రధానకార్యదర్శిగా కృష్ణయ్య, సహాధ్యక్షులుగా రాజేశ్వరీ, కరుణాకర్‌గౌడ్, కోశాధికారిగా వెంకటరమణ, కార్యదర్శులుగా కవిత, రవి, అబ్దుల్‌రవూఫ్, శేఖర్, సలహాదారులుగా సంపత్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షురాలు ఉమాదేవి, రాష్ట్ర కోశాధికారి కిష్టయ్య ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో సభ్యులు బల్‌రాంనాయక్, సంపత్, రాంబాబు, శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వమే ఆదుకోవాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆటో డ్రైవర్ల సంఘాల జేఏసీ నాయకులు

- 7న ఆటోల బంద్
- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తి

న్యూటౌన్: మహాలక్ష్మి పథకంతో తీవ్రంగా నష్టపోయిన ఆటో డ్రైవర్లను ప్రభుత్వమే ఆదుకోవాలని ఆటో డ్రైవర్ల జేఏసీ నాయకులు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి డిమాండ్ చేశారు. బుధవారం రైల్వేస్టేషన్ చౌరస్తాలో ఆటో సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా టీయూసీఐ రాష్ట్ర నాయకుడు వెంకటేష్, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడారు. ఈనెల 7వ తేదీన ఆటోల బంద్‌కు ప్రజలు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాజు, నగేష్, నరసింహులు, శ్రీను, భక్తరాజు, ఆంజనేయులు రెడ్డి, లక్ష్మణ్ తదితరులున్నారు.

చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



రాజాపూర్: విద్యార్థులు తమ విలువైన సమయాన్ని వృథా చేయకుండా చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఈఓ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా నేషనల్ అచ్యూవ్‌మెంట్ సర్వే పరీక్ష రాస్తున్న 6వ తరగతి విద్యార్థులను ఆయన పరిశీలించారు. అనంతరం పదో తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి వారితో సమాధానాలు రాబట్టారు. ఆయన అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు సరిగా సమాధానాలు చెప్పడంతో అభినందించారు. ఎంఈఓ సుధాకర్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఉన్నారు.

వ్యాసరచన పోటీలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఆర్వీఎం సమావేశ మందిరంలో పాఠశాల విద్యార్థులకు 'అవినీతి ప్రజాస్వామ్యాన్ని ఆర్థిక వ్యవస్థను ఎలా బలహీన పరుస్తుంది' అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏసీబీ ఇన్‌స్పెక్టర్ జిలానీ హాజరై ప్రసంగించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరైన లంచం అడిగితే 1064 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. విద్యార్థి దశ నుంచి నిజాయితీగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీబీ ఇన్‌స్పెక్టర్ లింగస్వామి, సీఎంఓ బాలుయాదవ్, సూపరింటెండెంట్ శంబూప్రసాద్, ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్ పాల్గొన్నారు.

నేడు పిడమర్తి రవి రాక

దేవరకద్ర: మండల కేంద్రంలోని దళితవాడకు ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి గురువారం వస్తారని మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాము బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జరిగే ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమానికి మాదిగలు, ఉపకులాల సోదరులు పెద్దఎత్తున తరలి రావాలని కోరారు.

పథకాల అమలులో కాంగ్రెస్ విఫలం

హన్వాడ: ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలు అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణవర్ధన్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి కిరణ్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శి బుచ్చిరెడ్డి విమర్శించారు. బుధవారం మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణ పిలుపు మేరకు... రాష్ట్రంలో కాంగ్రెస్ ఏడాది పాలన వైఫల్యాలను ప్రజలకు తెలిసేలా ఈర్యాలీ చేపట్టినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు వెంకటయ్య, నాయకులు రఘురాములుగౌడ్, లింగం, శ్రీనివాసులుగౌడ్, జాక్యానాయక్, శ్రీను, బాలు ముదిరాజ్, వెంకట్, రఘు, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

'మందకృష్ణ మాదిగ క్షమాపణ చెప్పాలి'

మహబూబ్‌నగర్ రూరల్: మాలలకు మందకృష్ణ మాదిగ తక్షణమే క్షమాపణలు చెప్పాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కోచైర్మన్ నర్సింహయ్య అన్నారు. బుధవారం స్థానిక మాల మహానాడు జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాలల సింహగర్జన బహిరంగ సభను చూసి మతిభ్రమించి మందకృష్ణ మాలలపై, కాకా వెంకటస్వామి కుటుంబంపై విషం కక్కడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మాలలను మనువాదులుగా చిత్రీకరించి మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. నాయకులు కేశవులు, గోపాల్, కానుగడ్డ యాదయ్య, కర్ణ పాల్గొన్నారు.

విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: సెన్సార్, యాక్చువేటర్ కంట్రోల్ సిస్టం వంటి అంశాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జేపీఎన్‌సీ కళాశాల చైర్మన్ రవికుమార్ అన్నారు. కళాశాలలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మూడు రోజుల వర్క్‌షాప్ ఆర్య డిజీవర్స్ సంస్థ ఆధ్వర్యంలో 'ఇంట్రడక్షన్ టు రోబోటిక్స్ అండ్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ' అనే అంశంపై నిర్వహించారు. బుధవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రవికుమార్ హాజరై ప్రసంగించారు. రోబోటిక్స్‌ను ఉత్పాదక రంగంలో ఆరోగ్య, రక్షణ, వ్యవసాయంతో పాటు ఇతర రంగాల్లో విరివిగా ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ సుజీవన్‌కుమార్, డిజీవర్స్ సంస్థ ప్రతినిధులు మానస, శిరీష, పూజిత, భద్ర తదితరులు పాల్గొన్నారు.